# — స హ గ మ న ము —

శ్రీ యం. రా మ జో గా రా వు గా రు

(గత సంచిక శేషము)

నూరు సంవత్సరముల బ్రిటిషు పరిపాలనములో నొక సహగమనపు కేసు గూడ గవర్నమెంటువారు విని యుండలేదు. జిల్లాపోలీసు అధికారి యీవిషయమును ఇన్స్పెక్టరుజనరలు పోలీసునకు కెఱింగించి యీ విషయమున నెట్టిచర్య జరుపవలసి యుండునో యనుజ్ఞ వేడెను. డైరెక్టరు జనరల ఆంగ్లదేశస్థుడు. ఆతనికి రుక్మిణీదేవి వాఙ్మూల మత్యంతాశ్చర్యము గొల్పినది. తోడనే యాతడు జిల్లాపోలీసు రెవిన్యూ అధికారులతో కూడ కృష్ణపురము ప్రవేశించి కేసు విచారణ ప్రారంభించెను. గ్రామోద్యోగస్థులు రుక్మిణీదేవి సహగమనము చేయనున్న సంగతి మొదట తమకు తెలియదనియు, తెలిసినతరువాత యామెకు ప్రభుత్వ చట్టము ప్రకారము సహగమనము కూడదని బోధించితిమి కాని యామె వినలేదనియు, గాన యామె వాఙ్మూలమును మాత్రమే గొని యేలినవారికి తెలియపఱచితిమనియు తమవలన దోషమావంతయు లేదనియు వాఙ్మూలమిచ్చిరి.

అనంతరము రుక్మిణీదేవి మామగారి వాఙ్మూలము గైకొనబడెను. అతడు తన కుమారునియొక్కయు, కోడలియొక్కయు పరస్పరప్రేమను, దాంపత్యజీవితమును వెల్లడించి తానెంతజెప్పినను కోడలు వినలేదనియు ఒకవేళ తాను రుక్మిణి సహగమనమున కంగీకరింపకపోయినను, బలవంతముగ నామె యే నూతినో గోతినో పడియైనను మరణించు ననెడి నమ్మకముచే, చేయునది లేక, దృఢసంకల్పముగల తనకోడలి కోర్కె చెల్లించితి ననియు నట్టికోడలిని బడసినందున తమకుటుంబము కీర్తి కెక్కినదనియు వాఙ్మూలమిచ్చెను.

బలరామశాస్త్రి కృష్ణశాస్త్రి సోదరుడు. కృష్ణశాస్త్రి కంటె రెండు మూడు సంవత్సరములు పెద్దవాడైయైనను, తమ్మునికి గల యోరిమియు, నెమ్మదియు బలరామశాస్త్రి వద్ద లేవు. అన్నదమ్ములిద్దరు నొకేవిధమైన యాదర్శములు గలవారు. కాని ద్వాపరయుగములోని బలరామ శ్రీకృష్ణులవలె, బలరామశాస్త్రి తనయభిప్రాయములను పైకి వెల్లడి చేయు స్వభావము గలవాడు. కోపశీలుడు. కృష్ణశాస్త్రి ఓరిమిగలవాడు. తనయాదర్శములను మాట్లాడకుండా కార్యరూపముగ జేసి చూపువాడు. బలరామశాస్త్రి రవీంద్రుని గోరావలె తనకు సరియని తోచిన దాని నాచరించువాడు. సహగమనముపై నాతనికి నమ్మకము మెండు. నిజమైన ప్రణయముగల దంపతుల ప్రేమకు విఘ్నము గలిగినప్పుడిది స్వభావ సిద్ధమైన పరిణామ మని యాతని దృఢమైన విశ్వాసము. రుక్మిణీదేవి పతిభక్తి లోని సత్యము నాతడు గ్రహించెను. ఆకారణముననే యాతడామెను వరుసకేకాక నిక్కముగ సోదరి వలె ప్రేమించుచుండెను. ఆమె యనిన యాతని కాదరము మెండు. ఆతని తలిదండ్రులు మమతచే రుక్మిణీదేవి సహగమనము చేయునపుడు విలపించిరి. కాని, బలరామశాస్త్రి కంటతడియైనను పెట్టలేదు. అతడామె భాగ్యమును కొనియాడి తన తమ్మునితో స్వర్గసౌఖ్యముల ననుభవింపుమని దీవించెను.

బలరామశాస్త్రి యగ్రజుండగుటచే రుక్మిణి సహగమనము నాపుటాతని ధర్మము కాని యాత డట్లేల గావింప ప్రయత్నము చేయలేదో యని యాతని వాఙ్మూలము గూడ నడుగబడెను. బలరామశాస్త్రి తన వాఙ్మూలమున ప్రపంచముననున్న యన్నివిధముల ప్రేమకంటే ఆదర్శదంపతులప్రేమ యత్యుత్తమము, పవిత్రము నైనదని అన్నిదేశములవారు గూడ నొప్పుకొందురు. గ్రీకుదేశస్థులు దీనిపై ననేక యుద్ధగ్రంథములను రచించిరి. ఇటలీ దేశస్థుడైన డాంటీ (Dante) మున్నగు కవులు ప్రేమగానము చేసియే ప్రసిద్ధిగాంచిరి. షేక్స్పియర్ (Shakespeare) తన సానెట్స్లో (Sonnets) లోను, స్పెన్సర్ (Spencer) మొదలు (Tennyson) వఱకుగల కవులందఱును ప్రణయమత్యుత్తమమైనదని ప్రశంసించిరి. ఇక భారతదేశస్థులీపవిత్ర ప్రేమను వివాహ బంధ మేర్పడిన కాలమునుండియు నొప్పుకొని యుండిరి. రురుడు, ప్రమద్వతి మరణింప, తన జీవితకాలములో

సగమామె కొలది ధారవోసి యామెను బ్రతికించుకొనెను. మ్లేచ్ఛ జాతులు భారత దేశమున నడుగు పెట్టనంతవఱకు సతులు తమ భర్తలను నిజముగ ప్రేమించి, వారు మరణించిన తరువాత, వారితో సంతోష పూర్వకముగ సహగమనము గావించుచుండిరి. ఆంగ్లసాహిత్యమున వెలడి చేయబడిన ప్రేమ కూడ పవిత్ర మైనది స్త్రీపురుషు లొకరినొకరు సత్యముగ ప్రేమించు కొనునపుడు వారిలోనే యొకరు మరణించినను రెండవవారు జీవింపజాలరు. పాశ్చాత్యు లీప్రణయము యొక్క ప్రథమ దశను మాత్రమే వర్ణించిరి గాని, దాని పరిణామమును గుర్తింప లేకపోయిరి. సనాతన హిందూదేశ మట్టిప్రేమ నమలులో పెట్టి దాని పర్యవసాన ఫలములను గూడ ననుభవించినది. ఆంగ్లేయుల పవిత్ర ప్రేమ గ్రంధములలో తప్ప నాచరణలో లేదు. ఆచరించినచో వారష్టమయెడ్వర్డును రాజ్యభ్రష్టుని గావించియుండరు. ఆతడు గావించిన యపరాధము తాను వలచినట్టియు, తన్ను ప్రేమించినట్టియు, స్త్రీని వివాహమాడుటయట! అధికారము చేత లేక పేరునకు మాత్రము సామ్రాట్టైన యెడ్వర్డు తనయిచ్ఛ వచ్చిన స్త్రీని వివాహమాడలేక పోవుట ఆతని దోషముకాదు. ప్రేమయొక్క తత్వమును గుర్తెఱిగి, ప్రపంచమునకు దానినిచాటి, నాగరిక ప్రపంచములో నత్యుత్తమమైన జాతులని విఱ్ఱవీగెడి పాశ్చాత్యుల దోషము. ఇదేమని యడిగినచో వారు రాజ్యాంగ తంత్రమని ప్రత్యుత్తర మిత్తురు. చెప్పునదొకటి చేయునదొకటి. ఏకపత్నీవ్రతమన్న నేమియో తెలియక చూచినస్త్రీనికామోపశమనమునకు పెండ్లాడెడి వారు భారతజాతియొక్క ప్రేమతత్వము నెఱుంగగలరా? ఈ సంస్కర్తలు క్షీణించిన యాచారమును మొదలంట నఱికిరిగాని, అయాచారముయొక్క పవిత్రతను గుర్తింప లేకపోయిరి. ప్రేమతత్వము నెఱింగి దాని పరిణామము మనఃపూర్వకముగ ననుభవింప సిద్ధముగ నున్నవారి కేల ప్రభుత్వమునుండి శిక్ష? రుక్మిణీదేవి బలవంతముగ సహగమనముచేయ ప్రోద్బలము చేయబడియుండలేదు. ఆమె తన పవిత్ర ప్రేమకు పర్యవసానముగ సహగమన మొనర్చినది. దీనికి గ్రామోద్యోగులు గాని, కృష్ణశాస్త్రి బంధువులుగాని యెట్టి బాధ్యతా దోషయుక్తులును గారు. ప్రభుత్వమునకు వీరిని శిక్షింప నెట్టి యధికారమును లేదు".

ఇన్స్పెక్టరుజనరలుని కీవాఙ్మూలము గుండుదెబ్బ వలె తగిలెను. తనజాతిలోని లోపములను వెల్లడించినప్పుడాతనికి కోపమువచ్చినది. చేతనధికారము గలవాడగుటచే శాంతము నటించి "ఇదియంతయును సత్యమే గాని, న్యాయశాస్త్రమునకు నేను బద్ధుడను. సహగమనము నాపక పోయినందులకై గ్రామోద్యోగుల కారుమాసములు విడిఖైదు నూరు రూపాయలు తలనొక్కింటికి జుల్మానా" యని తీర్పుచెప్పెను. ఏకజాతి వాడగు కలెక్టరు తన యామోదమును సూచించుచు కాగితముపై చేవ్రాలుచేసెను. "బలరామశాస్త్రి వాఙ్మూలము రాజద్రోహ పూరితముగ గన్పట్టుచున్నది. యీతనిని వేఱె విచారణచేయవలసి యుండును; గనుక ప్రస్తుత మాతనిని పోలీసువారు తమవశమున నుంచుకొనెదరు" అని కలెక్టరు పలికి జవానులకు సంజ్ఞాపూర్వక... నాజ్ఞయిచ్చెను. "ధర్మము కొఱకెట్టి శిక్షనైన మేముకూడ యనుభవింతుమని" యొక్కపెట్టున జనఘోషణ బయలుదేరెను. ఈ గ్రామస్థులుకూడ రాజద్రోహులుగనే కన్పట్టుచున్నారు. తరువాత వీరిసంగతి పూర్తిగ తెలిసికొందము. ప్రస్తుతము వీరిని లాటీదెబ్బల మూలముగ చెల్లాచెదరుగావింపుడని రక్షకభటులాజ్ఞాపింపబడిరి. రక్షకభటులు తమ యధికారులయాజ్ఞ ప్రకారము లాటీల నెత్తిరి. ఇంతలో బలరామశాస్త్రి "ప్రభుత్వచట్టములకు మనము బద్ధులము. ప్రస్తుతము మీరేమియు చేయనక్కరలేదు. ఎక్కడి వారక్కడకు పొండు" అని బిగ్గరగ హితోపదేశము గావించెను. దానితో జనము చెల్లాచెదరై పోయెను. బలరామశాస్త్రి గ్రామోద్యోగస్థులుగూడ కృష్ణపురమును వీడిరి. బలరామశాస్త్రికి దేశద్రోహియను నేరముపై సంవత్సరము ఖైదు వేయబడెను.